# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - ఉత్తర మాసిడోనియా దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమయ్యాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ నీట్ పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజ్ ఘటనలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశ యువత ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.
- ❖ నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ సహా పలు అంశాలపై విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కంటెంట్ క్రియేటర్స్ ను గుర్తించి వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం "జెమ్స్ ఆఫ్ ఇండియా ఛాలెంజ్"ను ప్రారంభించింది.

======================

భారత్, ఉత్తర మాసిడోనియా దేశాలు ప్రజాస్వామ్య విలువలు, పరస్పర గౌరవాన్ని ఆధారంగా చేసుకుని తమ స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఉత్తర మాసిడోనియాకు ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ (ఐటీఈసీ) కార్యక్రమం కింద అందించే శిక్షణా అవకాశాల సంఖ్యను రెట్టింపు చేయనున్నట్లు, ఇందులో కృత్రిమ మేధస్సు (ఏఐ)కు సంబంధించిన కోర్సులు కూడా ఉంటాయని రాష్ట్రపతి ప్రకటించారు. ఉత్తర మాసిడోనియాలో పర్యటిస్తున్న రాష్ట్రపతి.. రాజధాని స్కోప్జే నగరంలో ఆ దేశ అధ్యక్షురాలు గోర్డానా సిల్జనోస్కా డావ్‌కోవాతో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... ఇరు దేశాలు ద్వైపాక్షిక సహకారంలోని అన్ని అంశాలను సమీక్షించడంతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులను మరింత ప్రోత్సహించడంతో పాటు ఐటీ ఆధారిత సేవలు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఔషధ తయారీ, వస్త్ర పరిశ్రమ, బయోటెక్నాలజీ, పర్యాటకం, ఆతిథ్య రంగం వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు రెండు దేశాలు అంగీకరించినట్లు రాష్ట్రపతి తెలియజేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

=====================

దేశవ్యాప్తంగా భవిష్యత్‌లో నిర్వహించే పరీక్షల్లో ప్రశ్నా పత్రాలు లీక్ అవకుండా అన్ని వర్గాల భాగస్వాములు సమన్వయంతో కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన నీట్ (NEET) పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజ్ ఘటనలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశ యువత ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో 'మంగళ్ మిలాన్' పేరిట ఈరోజు నిర్వహించిన ఎన్‌డీఏ కూటమి పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరెన్ రిజిజు పాత్రికేయులకు వెల్లడించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీపై సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని ప్రధాని పేర్కొన్నారని తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న వారందరినీ అరెస్టు చేశామని, ప్రస్తుతం 13 మంది నిందితులు జైలులో ఉన్నారని ప్రధాని వెల్లడించినట్లు చెప్పారు.

(వాయిస్ 25 సెకన్లు)

ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా పలు కీలక బిల్లుల ఆమోదానికి ఎన్‌డీఏ కూటమి నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. దేశానికి సేవ చేయడం, దేశ భవిష్యత్‌ను పరిరక్షించడం, యువత సంక్షేమం కోసం పని చేయడం ప్రతి పార్లమెంట్ సభ్యుడి బాధ్యత అని కిరెన్ రిజిజు అన్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

=====================

ఉక్రెయిన్ తీర ప్రాంతంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో నలుగురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై వివరణ కోరుతూ రష్యా చార్జ్ డి అఫైర్స్ వ్లాదిమిర్ లడనోవ్‌ను విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఈరోజు పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం అంతర్జాతీయ సముద్ర వాణిజ్య భద్రత, స్థిరత్వానికి తీవ్ర ముప్పుగా మారుతుందని రష్యా దౌత్యాధికారికి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇలాంటి దాడుల కారణంగా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రష్యాకు తమ ఆందోళనను తెలియజేయాలని స్పష్టం చేసింది.

విరామం

=====================

నీట్ యూజీ ప్రశ్నా పత్రాల లీకేజ్ వ్యవహారం సహా పలు అంశాలపై విపక్షాలు చేపట్టిన నిరసనలతో పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రతిపక్ష సభ్యులు నీట్ ప్రశ్నా పత్రాల లీకేజ్ అంశాన్ని ప్రస్తావిస్తూ ఆందోళన చేపట్టారు. సభ నిర్వహణకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ సభ్యులు నినాదాలు కొనసాగించడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. 12 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు కూడా సభలో ప్రతిపక్ష సభ్యులు నిరసన కొనసాగించారు. ఈ ఆందోళనల మధ్య పార్లమెంట్‌లోని వివిధ కమిటీలకు సభ్యుల ఎన్నికకు సంబంధించిన తీర్మానాలను సభ చేపట్టింది. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. సభ మధ్యలోకి వెళ్లి నినాదాలు చేయడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. 2 గంటలకు సభ తిరిగి సమావేశమైన తర్వాత సభాధ్యక్ష స్థానంలో

ఉన్న దిలీప్ సైకియా ఆందోళన చేస్తున్న సభ్యులను పలుమార్లు హెచ్చరిస్తూ.. సభ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అయినా విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో లోక్‌సభను రేపు ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ఇక రాజ్యసభలోనూ ఇదే తరహా పరిస్థితి కొనసాగింది. ఉదయం 11 గంటలకు రాజ్యసభ సమావేశమైనప్పుడు కేంద్ర మంత్రులు తమ తమ శాఖలకు సంబంధించిన పత్రాలను సభ ముందు ఉంచారు. అనంతరం ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గేకు తన అంశాన్ని ప్రస్తావించే అవకాశం ఇవ్వగా.. నిన్న న్యూఢిల్లీలో నీట్ అంశంపై జరిగిన నిరసనల గురించి ఆయన మాట్లాడారు. అయితే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య నినాదాలు కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత విపక్షాలు నినాదాలు కొనసాగించడంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ రాజ్యసభను రేపు ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు.

=====================

దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఈ ఏడాది జూన్ 30 నాటికి 288 గిగావాట్లకు చేరిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెశో నాయక్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన ఈరోజు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రస్తుతం దేశంలో సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 162 గిగావాట్లకు పైగా ఉందన్నారు. అలాగే పవన విద్యుత్ సామర్థ్యం సుమారు 58 గిగావాట్లు, జల విద్యుత్ సామర్థ్యం 57 గిగావాట్లు, బయో పవర్ సామర్థ్యం 11 గిగావాట్లకు పైగా ఉందని వెల్లడించారు. 2013–14 ఆర్థిక సంవత్సరం నుంచి 2025–26 వరకు దేశం పునరుత్పాదక ఇంధన రంగంలో సుమారు 46 బిలియన్ డాలర్ల మేర ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని శ్రీపాద్ యెశో నాయక్ తెలిపారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్ ను గుర్తించి వారికి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'జెమ్స్ ఆఫ్ ఇండియా ఛాలెంజ్'ను ఈరోజు ప్రారంభించింది. వేవ్స్ ఓటీటీలోని మైవేవ్స్ వేదికపై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కంటెంట్ క్రియేటర్స్ తమ జిల్లాల ప్రత్యేకతలు, సాంస్కృతిక వారసత్వం, విశిష్ట కథనాలను ప్రతిబింబించే తక్కువ నిడివి వీడియోలను రూపొందించి పంపించాలని మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది.

=====================
=====================